STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 231 ఎడిటర్ : విక్రం కుమార్ బుధవారం 30 ఏప్రిల్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5



## కొత్త సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకం

- 14న ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి

2లో

## కరెంటు ఛార్జీల పెంపు లేదు

- టారిఫ్ ఉత్తర్వు జారీచేసిన ఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున్
- ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని డిస్కంల పిటిషన్
- విచారణ జరిపి రూ.13,499 కోట్లుగా నిర్ధారణ
- ఆ మొత్తాన్ని రాయితీగా ఇస్తామన్న ప్రభుత్వం

2లో



# సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ

- పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే
- అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ
- త్రివిధ దళాల అధిపతులతో ఢిల్లీలో భేటీ - రక్షణ మంత్రి, సీడీఎస్, జాతీయ భద్రతా సలహాదారు హాజరు
- మధ్యవర్తిత్వానికి సిద్ధం: ఇరాన్
- ఇరు దేశాలు సంయమనం పాటించాలి: చైనా
- ఐక్యరాజ్యసమితిలో భారత్, పాక్ ప్రతినిధుల పరస్పర ఆరోపణలు
- జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంట ఐదో రోజూ పాక్ ఆర్మీ కాల్పులు
- పహల్గాం ఉగ్రదాడి నిందితుల కోసం కొనసాగుతున్న వేట

2లో

## సీఎంను కదిలించిన పర్శ సాయి దీనగాథ

- తగిన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు ఆదేశం



2లో

## మిస్ వరల్డ్ పోటీలకు
# కట్టుదిట్టమైన భద్రత

- అతిథులకు చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్ని చూపించాలి
- సమీక్షలో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రం ఆతిథ్యం ఇస్తున్న మిస్‌వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు స్పష్టంచేశారు. మిస్ వరల్డ్ పోటీలపై మంగళవారం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. మే 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పోటీలకు జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులు సీఎంకు వివరించారు. 'విమానాశ్రయం, అతిథులు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్లో పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి. అందాల పోటీల్లో పాల్గొనేవారికి తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలి.



తరువాయి 2లో



## పాక్ మోసపూరిత దేశమని మళ్లీ స్పష్టమైంది

- భారత నౌకాదళం స్పష్టీకరణ
- విజయవంతంగా నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు

2లో



# వార్షిక రుణ ప్రణాళిక రూ.6.60 లక్షల కోట్లు

- వ్యవసాయరంగ లక్ష్యం రూ.3.06 లక్షల కోట్లు
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**సమయం న్యూస్, అమరావతి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రూ.6.60 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. 22శాతం అదనంగా రుణ ప్రణాళికను రూపొందించింది. సచివాలయంలో మంగళవారం జరిగిన 231వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 202526 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. 202425 రుణ ప్రణాళిక అమల్లో 127 శాతం వృద్ధి సాధించిన బ్యాంకర్లను అభినందించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం లక్ష్యానికి అనుగుణంగా వార్షిక రుణ ప్రణాళిక

తరువాయి 2లో

## నేడే తెలంగాణ టెన్త్ ఫలితాలు..

- మధ్యాహ్నం ఒంటి గంటకు విడుదల చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

2లో



epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ

ఉగ్రవాదాన్ని మట్టికరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీనిని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అంతకుముందు సైనిక ఉన్నతాధికారులు పలు దఫాలుగా సమావేశమై వ్యూహాల్ని సమీక్షించారు. మరోవైపు సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలను కొనసాగిస్తూనే ఉంది. వరుసగా ఐదో రోజూ (సోమవారం అర్ధరాత్రి) నియంత్రణ రేఖ వెంట కాల్పులు జరపగా భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని సడలింపజేయటానికి మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ గుటెరస్ వెల్లడించారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని చైనా సూచించింది. దక్షిణాసియాలో భారత్, పాకిస్థాన్ రెండూ ముఖ్యమైన దేశాలని, శాంతి, సుస్థిరత, అభివృద్ధి సాధనకు సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ ఓ మీడియా సమావేశంలో అభిలషించారు. ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్, ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన భేటీలో దేశంలో అంతర్గత భద్రతతో పాటు సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను శిక్షించాలన్నది దేశ ప్రజల దృఢ నిశ్చయమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మన సైనిక దళాల సామర్థ్యాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని' అని స్పష్టం చేశారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగింది. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌధరి, జాతీయ భద్రతా దళం డీజీ భృగు శ్రీనివాసన్, అస్సాం రైఫిల్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేడా, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అదనపు డైరెక్టర్ జనరల్ అనుపమా నీలేకర్ చంద్ర తదితరులు హాజరయ్యారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు బయటకు తెలియరాలేదు.

**అఖ్నూర్ సెక్టార్‌లో కాల్పులు**

పాకిస్థాన్ సైన్యం వరుసగా ఐదో రోజు రాత్రి కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు దిగింది. అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి, కుప్వారా, బారాముల్లా జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద పాక్ కాల్పులకు తెగబడినట్లు భారత సైనిక వర్గాలు తెలిపాయి. పాక్ ఆర్మీ దుశ్చర్యను బలంగా తిప్పికొట్టామని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నాయి.

* **జమ్మూకశ్మీర్‌లో 48 పర్యాటక ప్రాంతాల మూసివేత**

పహల్గాం ఉగ్రదాడి నిందితులను పట్టుకునేందుకు భారత భద్రతా బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. దీనికి ప్రతీకారంగా కశ్మీర్‌లో మరిన్ని విద్రోహ ఘటనలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్రమూకలకు సంబంధించిన నిద్రాణ శక్తులు క్రియాశీలం అయినట్లు తెలిపాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్‌లో ఉన్న మొత్తం 87 పర్యాటక కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి.

* **రాడార్ వ్యవస్థలను తరలిస్తున్న పాక్**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా తమపై భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతోన్న పాకిస్థాన్ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దాడులను పసిగట్టడానికి సియాల్‌కోట్ ప్రాంతానికి పాకిస్థాన్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58కి.మీ. దూరంలో ఉన్న ఖోర్ కంటోన్మెంట్ వద్ద టీపీఎస్77 రాడార్ సైట్‌ను ఏర్పాటుచేసింది. టీపీఎస్77 మల్టీరోల్ రాడార్ (ఎంఆర్ఆర్) అత్యంత సామర్థ్యం గల వ్యవస్థ.

* **పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత?**

తమ గగనతలంపై భారత దేశ విమానాల రాకపోకలపై పాకిస్థాన్ నిషేధం విధించిన నేపథ్యంలో న్యూదిల్లీ కూడా ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. పాక్ విమానాలు... కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణ సమయం పెరగడంతో పాటు నిర్వహణకు అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతం కానుంది.

* **నేడు కేంద్ర క్యాబినెట్ భేటీ**

కేంద్ర క్యాబినెట్ బుధవారం సమావేశం కానుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరుగుతున్న తొలి భేటీ కావడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించనున్నారు. గత వారం మంత్రిమండలి సమావేశం జరగలేదు. 23న భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై ఉగ్రదాడిని ఖండించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

# పాక్ మోసపూరిత దేశమని మళ్లీ స్పష్టమైంది

ఐరాస: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్‌లో హింసకు పాల్పడుతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై భారత్ ఎండగట్టింది. ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో పహల్గాం ఉగ్రదాడిని లేవనెత్తి.. దాయాదిపై విరుచుకుపడింది. న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయంలో సోమవారం జరిగిన 'ఉగ్రవాద అనుబంధ నెట్‌వర్క్ బాధితుల' కార్యక్రమంలో ఐరాస భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధి యోజన పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పహల్గాం దాడి ఘటనను ప్రస్తావిస్తూ పాక్‌ను దుయ్యబట్టారు. ''సీమాంతర ఉగ్రవాదానికి కొన్ని దశాబ్దాలుగా మేం బాధితులం. ఉగ్ర చర్యల వల్ల బాధితులు, వారి కుటుంబాలతో పాటు సమాజంపై ఎలాంటి దీర్ఘకాల ప్రభావం ఉంటుందో మాకు తెలుసు. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని, ఉగ్ర సంస్థలకు నిధులు సమీకరిస్తున్నామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ చెప్పిన మాటలను యావత్ ప్రపంచం వింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వారు బహిరంగంగా అంగీకరించినా.. ఎవరూ ఆశ్చర్యపోలేదు. పాక్ ఎలాంటి మోసపూరిత దేశమో దీన్ని బట్టి మరోసారి స్పష్టమైంది. ఆ దేశం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. ఉగ్రవాదం అంశంలో ప్రపంచం ఇకపై కళ్లు మూసుకుని కూర్చోదు'' అని ఆమె హెచ్చరించారు. భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయడానికి ఐరాసను పాక్ దుర్వినియోగం చేస్తోందని పటేల్ మండిపడ్డారు. పహల్గాంలో ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచ దేశాధినేతలు భారత్‌కు మద్దతు పలికాయని, ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమాజం ఎన్నటికీ అంగీకరించబోదని అన్నారు.

* **భారత్-పాక్ మధ్య చర్చలకు మద్దతిస్తాం: గుటెరస్**

భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఫోన్లో విడివిడిగా మాట్లాడారు. మరోవైపు భారత్‌పాక్ ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత తగ్గింపు, చర్చలను తిరిగి ప్రారంభించడానికి దోహదపడే అన్ని రకాల చర్యలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుటెరస్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ''భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందుతున్నాం. ఎలాంటి సమస్యలైనా నిర్మాణాత్మక చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చు. అందుకోసం ఎలాంటి మద్దతు ఇవ్వడానికైనా ఐరాస సిద్ధంగా ఉంది'' అని అందులో పేర్కొంది.

# కరెంటు ఛార్జీల పెంపు లేదు

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లో కరెంటు ఛార్జీల పెంపు లేదని, పాత పద్ధతిలోనే యథాతథంగా వసూలు చేయాలని డిస్కంలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశించింది. ఈమేరకు కరెంటు ఛార్జీల టారిఫ్ ఉత్తర్వును మంగళవారం మండలి కార్యాలయంలో ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వు గురువారం (మే 1) నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలోని రెండు డిస్కంలు, రాజన్న సిరిసిల్లలోని సెస్‌తో కలిపి మొత్తం మూడు విద్యుత్ సంస్థల ఆర్థికలోటు రూ.13,499.41 కోట్లు ఉంటుందని ఈఆర్‌సీ తేల్చింది. ఈ ఏడాది ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని గత నవంబరులో డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపగా.. అంతకు రూ.6,652 కోట్లు తక్కువగా రూ.13,499.41 కోట్లు ఉంటుందని వెల్లడైనట్లు ఛైర్మన్ తెలిపారు. వ్యవసాయ కరెంటు వినియోగం ఎక్కువగా ఉంటుందని భావించి డిస్కంలు ఎక్కువ లోటు చూపాయని, కానీ అంత ఉండదని ఈఆర్‌సీ విచారణలో నిర్ధారించినట్లు వివరించారు. మొత్తం ఆర్థికలోటు తీర్చడానికి రూ.13,499.41 కోట్లను రాయితీగా విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా తెలిపినందున ఛార్జీల పెంపునకు అనుమతించడం లేదని జస్టిస్ నాగార్జున్ వివరించారు.

**ఉత్తర్వులోని ముఖ్యాంశాలు...**

* గృహ వినియోగ కరెంటు ఛార్జీల్లో రాయితీలకు రూ.1,896.81 కోట్లు, వ్యవసాయానికి ఉచితంగా ఇస్తున్నందుకు మరో రూ.11,602.60 కోట్లు ఇస్తామని ప్రభుత్వం వివరించింది. గత ఆర్థిక సంవత్సరం (202425)లో ఇచ్చిన రాయితీ సొమ్ముకన్నా ఇది 1999.89 కోట్లు (17.4%) అధికం.
* గృహజ్యోతి పథకంలో 50,52,167 ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత కరెంటు కోసం ఈ ఏడాది ప్రభుత్వం రూ.1,922 కోట్లను చెల్లించనుంది.
* విద్యుత్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్ కాంట్రాక్టులోడు పరిమితి ఇంతకాలం 56 కిలోవాట్లు ఉండగా దానిని 150 కిలోవాట్లకు పెంచడానికి ఈఆర్‌సీ అనుమతించింది.
* గ్రిడ్ సపోర్టు రుసుం ప్రస్తుతం నెలకు కిలోవాట్‌కు రూ.18.48 ఉండగా.. మే 1 నుంచి రూ.20.04కి పెంచడానికి అనుమతించింది.
* ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు 24 గంటల ముందు నోటీసు ఇవ్వకుండా... కాంట్రాక్టు డిమాండుకన్నా అదనంగా కరెంటు వాడుకుంటే 10% అదనంగా ఛార్జీలను వసూలుచేస్తారు.



* **కరెంటు ప్రమాదాలపై అవగాహన పెరగాలి**

కరెంటు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్కంలకు సూచించినట్లు జస్టిస్ నాగార్జున్ చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తవుతుందని, అప్పటివరకూ పూర్తిగా 4 వేల మెగావాట్ల కరెంటు రాదని, దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పగటిపూట సౌరవిద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటున్నందున, రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నట్లు కనిపిస్తోందని, కానీ రాత్రిపూట థర్మల్ విద్యుత్ ఎక్కువగా అవసరమని.. డిస్కంలు బయట కొనాల్సి వస్తుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2030 నాటికి రాష్ట్రంలో కరెంటు కొరత ఏర్పడుతుందన్నారు. దాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్కేంద్రాలతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

(మొదటిపేజీ తరువాయి)

విభాగాల వారీగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి' అని సీఎం సూచించారు.

**పూర్తిస్థాయి ప్రణాళిక రూపొందించాలి**

హైదరాబాద్ నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మిస్‌వరల్డ్ 2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్‌భగవత్, హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

**నేడు విజయవాడకు సీఎం**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం ఏపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు విజయవాడ వెళ్లనున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో జరగనున్న వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని సీఎంవో వర్గాలు తెలిపాయి.

## కొత్త సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకం

దిల్లీ: భారత నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. మే 14న ఆయన చేత రాష్ట్రపతి ప్రమాణం చేయిస్తారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో 52వ సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ని రాష్ట్రపతి నియమించినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ మంగళవారం నోటిఫికేషన్ వెలువరించింది. 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పుల్ని వెలువరించారు. సీజేఐగా ఆరు నెలలు కొనసాగి నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు.

## సీఎంను కదిలించిన పర్శ సాయి దీనగాథ

హైదరాబాద్: జనగామలోని కుర్మవాడకు చెందిన పర్శ సాయి దీనస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి కుటుంబానికి తగిన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. 30 ఏళ్లుగా మంచానికే పరిమితమైన కుమారుడిని సాకలేకపోతున్నామంటూ సోమవారం జనగామ కలెక్టరేట్‌కు వచ్చిన పర్శ సాయి తల్లిదండ్రులు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. ఈ ఘటనపై వచ్చిన వార్తలకు సీఎం స్పందించారు. 'పర్శ సాయి దీనస్థితి నా దృష్టికి వచ్చింది' అని సీఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి, తల్లిదండ్రుల ఆర్థిక స్థితిపై వివరాలు తెలుసుకుని ప్రభుత్వం వైపు నుంచి సహాయ సహకారాలు అందించాలని సీఎం జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషాను ఆదేశించారు. కలెక్టర్ సూచనతో జనగామ ఆర్డీవో గోపీరాం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం పర్శ సాయి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, ఉపాధికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సాయం లభిస్తుందని భరోసా ఇచ్చారు. సాయికి నిమ్స్ లో వైద్య సహాయం అందించాలని నిర్ణయించారు.

## నేడే తెలంగాణ టెన్త్ ఫలితాలు..

హైదరాబాద్: పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారం వెల్లడి కానున్నాయి. రవీంద్రభారతి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం ఒంటి గంటకు ఫలితాలను విడుదల చేస్తారని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఎ.కృష్ణారావు తెలిపారు. ఈసారి జీపీఏ విధానాన్ని తొలగించినందున సబ్జెక్టుల వారీగా మార్కుల గ్రేడ్లు ఇవ్వనున్నారు. కనీస మార్కులు వస్తే పాస్ అని, లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదుచేస్తారు. ఫలితాలను www.results.bsetelangana.org, rsults.bse.telangana.gov.in, తదితర వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

## వార్షిక రుణ ప్రణాళిక రూ.6.60 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించామని బ్యాంకర్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి రుణాలిస్తామని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు విరివిగా రుణాలు అందిస్తామని వివరించారు. విద్యారుణాలు, గృహ రుణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎంఎస్‌ఎంఈ రంగానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 వేల కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా..రూ.95,620 కోట్లు ఇచ్చినట్లు బ్యాంకర్లు వివరించారు. వ్యవసాయ రుణాల్లో 116 శాతం వృద్ధి సాధించామని.. గతేడాది ఖరీఫ్‌లో రూ.1,69,177 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణంగా అందించామని నివేదించారు.

* **గత ఆర్థిక సంవత్సరంలో 2,54,527 మంది కౌలు రైతులకు రూ.4,411 కోట్ల రుణాలు ఇచ్చారు.**

**వృద్ధి ఎందుకు తగ్గుతోంది?**

వార్షిక రుణ ప్రణాళిక అమలులో వృద్ధి ఎందుకు తగ్గుతోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బ్యాంకర్లను ప్రశ్నించారు. 202122 సంవత్సరం లక్ష్యంలో వృద్ధి 133 శాతం, 202223లో 163 శాతం, 202324లో 138 శాతం వృద్ధి ఉండగా.. 202425లో 127 శాతం మాత్రమే ఉండటాన్ని ప్రస్తావించారు.

## నైపుణ్య శిక్షణకు రాష్ట్రంలో ఆస్ట్రేలియా వర్సిటీ!

* **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రతినిధుల చర్చ**

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ అందించే యూనివర్సిటీ ఏర్పాటుకు ఆస్ట్రేలియా వాణిజ్య ప్రతినిధులు ముందుకు వచ్చారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయానికి తోడు మరో ఉన్నతస్థాయి టెక్నాలజీ క్యాంపస్ అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధులతో శ్రీధర్‌బాబు చర్చించారు. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్నందున గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లలో పనిచేస్తున్న 3 లక్షల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు, చదువులు పూర్తిచేసుకునే విద్యార్థులకు నూతన నైపుణ్యాలపై శిక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ''తమ యూనివర్సిటీ ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని ఆస్ట్రేలియా ప్రతినిధులు చెబుతున్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



## రాజీవ్ యువ వికాసం ఆన్ లైన్ దరఖాస్తులను 30వ తేదిలోగా వార్డు కార్యాలయాల్లో సమర్పించాలి

*** అంబర్ పేట తహసిల్దార్ వీరబాయి**



అంబర్ పేట, ఏప్రిల్ 29 (సమయం న్యూస్): అంబర్ పేట మండల కార్యాలయం పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ దరఖాస్తులను ఈనెల 30వ తేదిలోగా వార్డు కార్యాలయాల్లో అందజేయాలని తహసీల్దార్ వీరాబాయి తెలిపారు. తహసిల్దార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్లతోపాటు ఈ.బి.సి./ఈడబ్ల్యుఎస్ ద్వారా నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయంకోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం కోసం మండలం కార్యాలయం పరిధిలో ప్రజలు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మీసేవ కేంద్రాల ద్వారా ఆన్ లైన్ దరఖాస్తు చేసిన వారిలో కొందరు ఆయా దరఖాస్తు పత్రాలను వార్డు కార్యాలయంలో అందజేయడం లేదని తహసిల్దార్ పేర్కొన్నారు. ఎవరైతే మీ సేవా కేంద్రాల్లో ఆన్ లైన్ దరఖాస్తు చేసుకుని, వార్డు కార్యాలయాల్లో సమర్పించని వారు అవసరమైన పత్రాలతో పాటు ఈనెల 30వ తేదిలోగా ఆయా కేంద్రాలకు వెళ్లి అందజేయాలన్నారు.

## పింఛను డబ్బులు వేయండి..

*** వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇబ్బంది లేకుండా చూడండి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



అంబర్ పేట,ఏప్రిల్, 29, (సమయం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కూడా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛను డబ్బులు వేయలేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. పింఛను డబ్బులు సకాలంలో విడుదల చేయకపోవడంతో పింఛన్లుదారులంతా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పింఛను డబ్బులు వేయకపోవడంతో వృద్ధులు తమకు కావలసిన వైద్యానికి కావలసిన మందులు తదితర అవసరాలు తీర్చుకోలేకపోతున్నారని వాపోయారు. ఈనెల 29 తారీకు వచ్చిన ఇప్పటివరకు ప్రభుత్వం పింఛన్ డబ్బులు ఎందుకు వేయలేదు అని ప్రశ్నించారు. వెంటనే పింఛన్దారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## కొనుగోలు కేంద్ర్రాల్లో నిర్లక్ష్యం అంటూ రోడ్డుపై బైఠాయించిన ఉప్పు లింగాపూర్ రైతులు

వెల్దుర్తి ఏప్రిల్ 29 సమయం న్యూస్ : అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, తూకం వెయ్యడం పూర్తిగా మరిచిపోయారంటూ అధికారుల నిర్ల క్ష్యంపై ఆగ్రహించిన వెల్దుర్తి మండ లంలోని ఉప్పు లింగాపూర్ గ్రామ రైతన్నలు ధాన్యాన్నివెంటనేకొను గోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వెల్దుర్తి - మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా బస్సులు, ట్రాక్టర్లు, భారీ వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కోతలు ప్రారంభమై నెలరోజులు గడుస్తుందని ఈనెల 17న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు కొనుగోలు చేపట్టడం పూర్తిగా మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుండి ధాన్యం కుప్పలపై రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న టాపర్లు పూర్తిగా చినిగిపోయి మళ్లీ కొత్తవి కొనుక్కునే దుస్థితి రైతులకు ఏర్పడిందని కొంతమంది రైతులు టాపర్ల కిరాయిలు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని తీవ్రంగా మండిపడ్డారు. అకాల వర్షాలు ఈదురుగాలులతో ధాన్యం తడిసి ముద్దవుతుందని, తిండి తిప్పలు లేకుండా రాశుల వద్దే కాపలా ఉండాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడిందని వాపోయారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్




అంబర్ పేట, ఏప్రిల్, 29 (సమయం న్యూస్) : స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్ పేట కార్పొరేటర్ విజయ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని పటేల్ బాడలో స్థానిక జిహెచ్ఎంసి సిబ్బంది మరియు ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తివాసులతో సమస్యలు అడుగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇ. విజయకుమార్ గౌడ్ మాట్లాడుతూ పరిశుభ్రత పై జిహెచ్ఎంసి సిబ్బంది దృష్టి సారించాలని ఎప్పటికప్పుడు చెత్త తీసివేయాలని అదేవిధంగా నూతన డ్రైనేజీ లైన్లకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అదేవిధంగా గత నాలుగు సంవత్సరాల నుంచి అంబర్ పేట డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నానని తెలిపారు.

## మేడే సందేశం.. పని గంటల పెంపుదల, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం

*** బి. మల్లేష్**




బోధన్ పట్టణం, ఏప్రిల్ 29 సమయం న్యూస్ : బోధన్, నిజామాబాద్: మే 1 మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ) రాష్ట్ర నాయకుడు బి. మల్లేష్ కార్మిక వర్గానికి కీలక సందేశం అందించారు. కార్మికులపై విధింపబడుతున్న పని గంటల పెంపుదల, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్, లివింగ్ వేతనాలు, కనీస పెన్షన్ సాధన కోసం ప్రభుత్వం మీద డిమాండ్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని ఫిల్టర్ బెడ్ వద్ద కార్మికులతో కలిసి మేడే పోస్టర్ల ఆవిష్కరణ జరిగిన ఈ సందర్భంగా, బి. మల్లేష్ మాట్లాడుతూ, "చికాగోలో 139 ఏళ్ల క్రితం 8 గంటల పని దినం కోసం కార్మికులు పోరాడి, ప్రాణత్యాగాలు చేశారు. కానీ నేడు పెట్టుబడిదారులు మళ్లీ 10-13 గంటలు పనిచేయాలంటూ ఒత్తిడి చేస్తుండగా, మన పాలకులు కార్మిక చట్టాలనే మార్చేస్తున్నారు" అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఈపీఎఫ్ కార్మికులందరికీ కనీస రూ.9,000 పెన్షన్ కల్పించాలని, ఎన్ఎంఆర్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని టి యు సి ఐ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లతో మే డే రోజున అన్ని కార్మికులు పెద్ద ఎత్తున పోరాటంలో పాల్గొనాలని మల్లేష్ పిలుపునిచ్చారు. రాజు, లక్ష్మి, హనుమాండ్లు, మజీద్, పోశెట్టి, వాహబ్, గణేష్, నికేష్, రవి, ఇబ్రహీం, ఈసూప్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది

*** నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దు**

*** గ్రామస్తులకు భద్రాచలం ఏఎస్పి సూచన**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(సమయం న్యూస్): మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారు అభివృద్ధికి నిరంతర సహాయ సహకారాలు ఉంటాయని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం చర్ల పోలీసుల ఆధ్వర్యంలో చర్ల మండలం లోని చత్తీస్గడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన ఎర్రంపాడులో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. కార్యక్రమం నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఈ గ్రామంలో ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే మహిళలకు చిన్న పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సారధ్యంలో ఆదివాసీ ప్రజలకు విద్య వైద్యం రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై లు స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## అడవిని నమ్ముకొని జీవించే కొండరెడ్ల అభివృద్ధికి నిరంతర కృషి

*** అధికారులు నెలకు ఒకసారి కొండరెడ్ల గ్రామాలను సందర్శించాలి**

*** సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలి**

*** గ్రామాలకు రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం**

*** రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ముందడుగు**

*** మన జిల్లాలో కావలసిన వనరులు పుష్కలంగా ఉన్నాయి**

*** వాటిని సద్వినియోగం చేసుకోవాలి**

*** వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(సమయం న్యూస్): అడవిని నమ్ముకుని జీవించే కొండ రేడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా నెలకు ఒకసారి ఆ గ్రామాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని జిల్లా కలెక్టర్ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకొని వెళ్లి వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం దమ్మపేట మండలం పూసుకుంట గ్రామానికి వెళ్లే మార్గంలో నాలుగు కోట్ల 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కల్వర్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం పూసుకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో నివసించే కొండరేడ్ల గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక విద్యా వైద్యం మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు పడుతుండేవారని వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని గత జనవరి మాసంలో ఫారెస్ట్ వారి అనుమతి తీసుకొని కల్వర్టుల నిర్మాణం కొరకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని నేడు ఆ కలవర్టులను ప్రారంభించి వర్షాకాలంలో ఈ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసామని అలాగే బీటీ రోడ్డు పనులను కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు ఏమైనా అడ్డంకులు సృష్టిస్తే సంబంధిత ఆర్ అండ్ బి పంచాయతీరాజ్ ఇరిగేషన్ విద్యుత్ శాఖ అధికారులు వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకొని పోయి సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ముందడుగులో ఉందని మన జిల్లాలో కావలసిన వనరులు ఎన్నో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొండ కోనల్లో నివసించే ఆదిమ గిరిజనుల సంక్షేమాన్ని ముఖ్యంగా విద్యావైద్యం మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారుల సమన్వయంతో అభివృద్ధి దిశగా తీసుకుపోతున్నామని పేద కుటుంబాలకు సన్న బియ్యం గిరిజన నిరుద్యోగ యువకులకు రాజీవ్ యువ వికాస పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని చిన్నారులకు పౌష్టికారమైన ఆహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇప్పించడం జరుగుతుందని గర్భిణీ స్త్రీలకు బాలామృతం అందజేస్తున్నామని అన్నారు. గిరిజన కుటుంబాల ఆరోగ్యపరంగా కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఈ గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పడినందున ఈ గ్రామంలోని గిరిజనులు అత్యవసర చికిత్సల కోసం ఆసుపత్రికి వెళ్లడానికి రెండు అంబులెన్స్లను ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. కొండరెడ్ల గిరిజనులు జీవనోపాధి పెంపొందించుకొని కుటుంబాలను పోషించుకోవడానికి గత సమావేశంలో దరఖాస్తులు చేసుకున్న కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల విలువగల టెంట్ హౌస్, మైక్ సిస్టం తుమ్మల నారాయణమ్మ, యాట్ల కాంతారెడ్డి కుటుంబాలకు తేనెను సేకరించి అమ్ముకోవడానికి 45 వేల రూపాయల విలువగల తేనే తయారీ బాక్సులు ఐదుగురికి 9 బాక్సుల చొప్పున అందించి వారికి తేనె సేకరణ గురించి శిక్షణ బ్యాంబో క్రాఫ్ట్ తయారీ శిక్షణ ఉత్సాహవంతులైన యువతీ యువకులకు ఐటీడీఏ ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. అలాగే డ్రైవింగ్ శిక్షణ తీసుకున్న కొండరెడ్ల యువకులకు సంబంధిత పోలీస్ అధికారులు ఆర్టీవోతో మాట్లాడి వారికి డ్రైవింగ్ లైసెన్సులు అందేలా చూడాలని భారతదేశంలో ఎక్కడా లభించని ఖనిజాలు కొత్తగూడెం జిల్లాలో దొరుకుతున్నాయని గిరిజన యువతి యువకులు కొత్తగూడెంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ద్వారా మంచి ప్రావీణ్యం పొంది భూగర్భ జలాలలో ఉన్న ఖనిజాలను కనుగొనే విధంగా నైపుణ్యాన్ని పెంచుకొని వేరే దేశాలకు మన పేరు వ్యాప్తి చెందేలా చూడాలని అన్నారు. గిరిజన రైతులకు మేలు జరగాలంటే భూగర్భ జలాలు పెంపొందించుకుంటే మన భూములు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే చొరవతో 250 కోట్ల వ్యయంతో మోడల్ రెసిడెన్షియల్ కళాశాల నిర్మాణానికి సీఎం ఒప్పుకున్నందున 25 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం ఉందని ఆ భూమిని సేకరించి మోడల్ రెసిడెన్షియల్ కళాశాల శంకుస్థాపన త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, శిక్షణ కలెక్టర్ శర్మ, ఎస్పీ రోహిత్ రాజ్, ఆర్డీవో మధుసూదన్, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశ్వరరావు, డిపిఓ చంద్రమౌళి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలరావు, ఎస్సీ ఎన్పీడీసీఎల్ రమేష్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ రోహిత్ రాజు సేవలుభేష్

*** విద్యార్థి సంఘం నేత కోట శివశంకర్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (సమయం న్యూస్): బాధితులకు న్యాయం చేస్తూ చిత్తశుద్ధితో ముందుకు పోతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజును మంగళవారం తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివ శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రజల రక్షణ కొరకు పనిచేస్తున్న పోలీస్ సేవలు భేష్ అని కొనియాడారు. ఒక విద్యార్థిని విషయంలో న్యాయం చేసిన ఎస్పీ రోహిత్ రాజును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎట్టపాక మండలం గోగుపాక గ్రామానికి చెందిన తల్లితండ్రులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లుగా కోటా శివశంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు ములకపల్లి నాగమణి ములకలపల్లి శ్రీనివాస్ మహిళా నాయకురాలు ప్రమీల బొందమ్మ ఎస్సీ నాయకులు అప్పారావు బత్తిని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ నూతన కమిటీ నియామకం

మందమర్రి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ నూతన కమిటీని నియమించడం జరిగిందని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు హాఫీస్, పట్టణ అధ్యక్షుడు సోత్కు ఉదయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు సోత్కు సుదర్శన్, మంద తిరుమల్ రెడ్డి, పుల్లూరి లక్ష్మణ్ లు తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకొని, వారికి నియమ పత్రాలు అందజేశారు. సేవాదళ్ పట్టణ ఉపాధ్యక్షుడిగా ఆలం శంకర్, ప్రధాన



కార్యదర్శిగా రామసాని సురేందర్, కార్యదర్శులుగా భూకాల సంతోష్, మాన్యాల శివకుమార్, జాయింట్ కార్యదర్శిగా గులాం మహమ్మద్, దస్తగిరి పాషా లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సేవాదళ్ నాయకులు మాట్లాడుతూ, తమకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం సేవాదళ్ సభ్యులుగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు జమల్పూరి నర్సోజి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేరువట్ల శ్రీనివాస్, కనకం రాజు, బూడిద శంకర్, రాచర్ల గణేష్, మాయా తిరుపతి రెడ్డి, ఐలయ్య లు పాల్గొన్నారు.



## పరంజ్యోతిరావును పరామర్శించిన మద్దెల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(సమయం న్యూస్): శరీర రుగ్మతలతో హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న కొత్తగూడెం మాజీ జడ్పిటిసి సభ్యులు రాష్ట్ర మాల మహానాడు సెక్రటరీ జనరల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆచార్య డాక్టర్ మద్దెలకు బాల్య పాఠశాల స్నేహితులు గిడ్ల పరంజ్యోతిరావును భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, జాతీయ ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రముఖ అంబేద్కర్ వాది గొల్లపల్లి దయానందరావు మంగళవారం పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈసందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల పరంజ్యోతి రావు త్వరగా కోలుకోవాలని వారి చికిత్స విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సామంతుల శంకర్ లతో పాటు జయ పరంజ్యోతి రావు శంకర్ తదితరులు ఉన్నారు.

# కార్మికులకు హై పవర్ వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయం

* **సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన**

మందమర్రి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: కోలిండియాకు చెందిన బొగ్గు పరిశ్రమలు జేబీసీసీఐ లో తీసుకున్న నిర్ణయం మేరకు కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేస్తుండగా, లాభాలతో నడుస్తున్న సింగరేణిలో మాత్రం కుంటి సాకులు చెప్పి, హై పవర్ వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయమని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియాలోని ఏరియా జిఎం కార్యాలయం, ఏరియా సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ రాము లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో అన్ని విభాగాలలో సుమారు 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, వారికి చట్టబద్ధమైన వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో, కుటుంబాలను పోషించుకోలేకపోతున్నారని ఆరోపించారు. కార్మికులకు చట్టబద్ధమైన హక్కులను, సౌకర్యాలను అమలు చేయకుండా, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం వెంటనే కృషి చేయాలని కోరారు. జెబిసిసిఐ నిర్ణయించిన హై పవర్ కమిటీ వేతనాలను 2013 నుండి అమలు చేయవలసి ఉండగా, సింగరేణి యాజమాన్యం అమలు చేయడం లేదని ఆరోపించారు. సింగరేణితో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారు దళిత, గిరిజన,




మైనార్టీ, నిరుపేదలని, వారి శ్రమకు తగ్గ వేతనం లభించకపోవడంతో లక్షలాది రూపాయల కష్టార్జితం కోల్పోయి, ఇబ్బందులను అనుభవిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, ఎందుకు సింగరేణి యాజమాన్యం అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినప్పటికీ సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచడానికి చొరవ చూపలేదని ఆరోపించారు. ఈ మేడే సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల వేతనాలను, చట్టబద్ధ హక్కులను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సంఘాల ప్రతినిధులు ఐఎఫ్టియు నాయకులు ఎండి జాఫర్, పి మహేశ్వరి, ఆర్ అజయ్, ఎస్ కనకయ్య, ఎస్ భూమయ్య, వెంకట స్వామి, గణేష్, టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు ఠాకూర్ మణిరాం సింగ్, నాయకులు ఎండి సుల్తాన్, రాజేందర్ లు పాల్గొన్నారు.



## ఉగ్రవాద దాడుల్ని ఖండిద్దాం

: **దేశ ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలి - సిపిఎం పిలుపు**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 29, సమయం న్యూస్ : కాశ్మీర్ లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పులపై నిరసనగా, మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోనీ స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఉగ్రవాద దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు మాట్లాడుతూ, "పహల్గాం లో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మందిని హత్య చేశారు. ఉగ్రవాదులకు మతాలు, కులాలు లేవు. వారు దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టి అశాంతిని నెలకొల్పాలనుకుంటున్నారు," అన్నారు. అలాగే, ఉగ్రవాదులను అడ్డుకునే విషయంలో కేంద్ర ప్రభుత్వ ఇంటలిజెన్స్ విఫలమైందని, దీనిని కప్పిపుచ్చేందుకు హిందూముస్లిం వ్యత్యాసాలను హైలైట్ చేస్తూ ప్రజల్లో చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తుండటం తగదని ఆయన విమర్శించారు. "దేశ పౌరులందరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలవాలి," అని రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూర్జహాన్, శంకర్ గౌడ్, నన్నేసాబ్, గంగాధర అప్ప, మల్లేష్, గోపి, పోశెట్టి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారైన సరే కేసులు నమోదు చేస్తాం

* **ప్రజల రక్షణకే పోలీసు వ్యవస్థ, చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోవద్దు**
* **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

జిన్నారం, ఏప్రిల్ 29, సమయం న్యూస్ : చట్టాన్ని చేతిలోకి తీసుకొని మతపరమైన అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తామని, ప్రజల రక్షణ కోసమే పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో ఇటీవల జరిగిన సంఘటన రెండు వర్గాల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా జీవించాలన్న ఉద్దేశంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు పటాన్చెరు సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతియుత సమావేశం మంగళవారం ఎన్ఆర్ఎస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ సంజీవరావు, డిఎస్పి రవీందర్ రెడ్డి లు హాజరయ్యారు. పఠాన్ చెరు నియోజకవర్గంలో వివిధ పార్టీ నాయకులు, హిందూ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కాశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందిన మృతులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశిస్తూ ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ



జిన్నారం మండల కేంద్రంలో జరిగిన సంఘటన అనాలోచిత నిర్ణయలతో జరిగిందన్నారు. సంఘటనపై యువత వాస్తవాలను తెలుసుకోకుండా ఘర్షణ వాతావరణం సృష్టించారన్నారు. సంఘటనపై సరైన అవగాహన లేకుండానే కొంతమంది ఘర్షణలో పాల్గొని జిన్నారం గ్రామానికి చెడ్డ పేరు తెచ్చారన్నారు. యువత సోషల్ మీడియాలో వచ్చిందే నిజం అనుకొని వాస్తవాలు తెలుసుకోకుండా మత ఘర్షణలో పాల్గొంటే వివిధ రకాల సెక్షన్లతో కేసులు నమోదై భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల్లో వీసా, పాస్ పోర్ట్ తదితర విషయాల్లో యువత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రెండు వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ స్నేహభావంతో జీవించాలని కోరారు. ఇప్పటికైనా రెండు వర్గాల ప్రజలు నాయకులు ఇలాంటి సంఘటనలో పునరావృతం కాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. సంఘటనకు సంబంధించి కేసులు నమోదయి జైలుకు వెళ్ళిన వారిపై కేసులు ఎత్తివేయాలని కొత్తగా కేసులు నమోదు చేయకుండా చూడాలని నాయకులు ప్రజల కోరిన కోరిక మేరకు స్పందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రెండు వర్గాల ప్రజలు నాయకులు స్పష్టమైన హామీ ఇస్తే తనపరిధిలో ఉన్నంతవరకు సహకరిస్తానన్నారు. అంతకుముందు మాట్లాడిన మాజీ జెడ్పిటిసి ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బిజెపి నాయకులు నర్సింగరావు ఈ ప్రాంతంలో హిందూ ముస్లిం అనే భావన లేకుండా కలిసిమెలిసి జీవనం సాగిస్తారని గతంలో ఎప్పుడూ ఇలాంటి వాతావరణం చోటు చేసుకోలేదని ఆ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. అదే రోజు కాశ్మీర్లో సంఘటన జరగడంతో కొంతమంది ఆవేశానికి లోనై సంఘర్షణ సృష్టించారని వారంతా ప్రస్తుతం ప్రచత్తాప పడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తామంతా ముందుంటామని జిల్లా ఎస్పీ మానవతా దృక్పథంతో మరికొంతమందిపై కేసులు కాకుండా చూడాలని కోరారు. ముస్లిం నాయకులు హుస్సేన్, చౌక్హాలీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరం నుంచి అన్నదమ్ముల లెక్కల హిందూ ముస్లింలు అన్న భావన లేకుండా జీవిస్తున్నామని ఇటీవల జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. హిందువుల ప్రేమాభిమానాలు కావాలని రంజాన్ పండుగకు ఇఫ్తార్ విందు ఇస్తారని అలాంటి ప్రేమ అభిమానాలు దయ ఉండాలని ఇకముందు ప్రేమ అభిమానులతో ముందుకు సాగుదామని కొత్తగా కేసులు కాకుండా ఇప్పటికే అయిన కేసులను ఎత్తివేయాలని హుస్సేన్ ఎస్పీ ని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు వినాయక రెడ్డి, నరేష్, రవీందర్ రెడ్డి, నాయుముద్దీన్, స్థానిక ఎస్సై నాగలక్ష్మి, ఎస్బి విజయ్ కృష్ణ, హిందూ, ముస్లిం నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



## బిసి డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

* **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: బిసి డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని జాతీయ బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ పంపించారు. ఈ సందర్భంగా జాతీయ బిసి హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో జరిగిన బిసి డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎంబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని, బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, 5 సంవత్సరాలలో బిసిల సంక్షేమానికి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని, అన్ని జిల్లా కేంద్రాలలో బిసి భవనాలు నిర్మిస్తామని, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. అధికారం చేపట్టి సంవత్సరం నర అవుతున్నా ఏ ఒక్క హామీని నెర వేర్చలేదని, కేవలం బిసి ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ బిసి లకు హామీ ఇచ్చినట్లుగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం బిసి సమాజం ముందు దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు గజేల్లి వెంకటయ్య, శాఖపురి భీంసేన్, అంకం సతీష్, షేక్ సల్మాన్ ఖాన్, కీర్తి బిక్షపతి, అంజన్న, లలిత

# జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 29: జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ మంగళవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా నియమితులయ్యారు. బదిలీ పై వెళుతున్న కమిషనర్ కె. ఇలంబర్తి నుండి ఆర్ వి కర్ణన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా




సేవలందించిన ఆర్.వి. కర్ణన్, హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటి ఆహార సంస్థలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించి, ప్రజలలో ఆహార భద్రతపై అవగాహన పెంచారు. జిహెచ్ఎంసి కమిషనర్ గా కొనసాగిన కె. ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్‌గా తన పదవీకాలంలో నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పౌర సేవల మెరుగుదల కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో ఏం ఏ యు డి కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా, నూతన కమిషనర్ కు అదే విధంగా బదిలీ పై వెళుతున్న ఇలాంబర్తీ కి జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు..

# భూ భారతి చట్టంతో రైతులకు, ప్రజలకు భూ సమస్యల తక్షణ పరిష్కారం

**: మాజీ మంత్రి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి**



బోధన్ పట్టణం, ఏప్రిల్ 29, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులచే భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం 2025 రైతులకు అవగాహన సదస్సు ను బోధన్, సాలురా మండలాల, డివిజన్ రైతులతో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నియోజకవర్గ శాసనసభ్యులు ప్రొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ భూభారతిని (ఆర్ ఓ ఆర్) చట్టం 2025ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 14 తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని తెలుపుతూ దీనికి సంబంధించిన విషయాన్ని ప్రొజెక్టర్ ద్వారా రైతులకు తెలియపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ భారతి చట్టం ఉపయోగాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ చట్టం పై వివరణ ఇస్తూ ఈ చట్టంలో ఎన్నో కీలక అంశాలు ఉన్నాయని, ఇదివరకు రికార్డుల్లో ఉన్న తప్పుల సవరణ సరి చేసుకోవచ్చని అదేవిధంగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మరియు మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూముల మ్యుటేషన్ ఇతర సమస్యలు ఏమి ఉన్న సమస్యలు కానీ లోపాలు కానీ సరి చేసుకోవచ్చు అని, పలు సెక్షన్ల గురించి రూల్స్ గురించి తెలియచేసారు. రైతుల సమస్యల పై సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలని లేదా రెవెన్యూ సిబ్బంది, అధికారులు తమ గ్రామంలో పర్యటన చేసి తగిన సలహాలు సూచనలు పొంది అ విధంగానే ప్రయత్నించాలని తెలిపారు. అలాగే రైతులకు ఏవైనా తప్పులు అనిపించినట్లయితే తహసిల్దార్ కి, ఆర్డీవో కి , కలెక్టర్ కి, సంబంధిత శాఖ అధికారి కూడా రెండంచల విధానం ద్వారా అర్జీ పెట్టుకొని సమస్యలను అధిగమించవచ్చని, దీనికంటూ కొంతకాల పరిమితి ఉంటుందని అన్నారు. మొత్తానికి ఈ భూ భారతి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బోధన్ మున్సిపాలిటీలో, గ్రామపంచాయతీలలో గల భూ సమస్యలను ఈ చట్టం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. అలాగే రైతులు మాట్లాడుతూ పరిష్కారవంతంగా లేని పలు అంశాలను అధికారులకు తెలుపగా, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని, పరిష్కారనీకై కృషి చేస్తామని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అగ్రికల్చర్ అధికారులు, బోధన్ సాలూర తహసిల్దార్లు విట్టల్, శశి భూషణ్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఏఎంసీ ఇన్చార్జి చైర్మన్ చీల శంకర్, పిఎసిఎస్ చైర్మన్లు, తదితర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ మేజిస్ట్రేట్ ను సన్మానించిన సీనియర్ న్యాయవాదులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(సమయం న్యూస్):కొత్తగూడెంలో ఇటీవల స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా భాద్యతలు తీసుకున్న మెండు రాజమల్లును మంగళవారం సీనియర్ న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ స్టాండింగ్ కౌన్సిల్స్ జివికే.మనోహర్ రావు, వెల్లంకి వెంకటేశ్వరరావు, ప్రభుత్వ ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ రావి విజయకుమార్, ఛీఫ్ లీగలేడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఊటికూరు పురుషోత్తమరావులు పాల్గొని సన్మానించారు.

## సీసీఎస్ పోలీసు అధికారులు
# సిబ్బందిని అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(సమయం న్యూస్): ఈ నెల 26వ తేదీన తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్న జిల్లా సిసిఎస్ పోలీస్ అధికారులు సిబ్బందిని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకొని నిందితులను పట్టుకోవడంలో బాధ్యతగా విధులు నిర్వర్తించినందుకు గాను రాష్ట్ర డిజిపి వీరికి ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఆంధ్రాఒరిస్సా అటవీ ప్రాంతాల నుండి అక్రమార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినందులకుగాను రాష్ట్రంలోనే అధికంగా భద్రాది కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారులు సిబ్బందికి నగదు రివార్డులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎవరైనా ప్రభుత్వ నిషేధిత గంజాయిని రవాణా చేసినా విక్రయించినా కొనుగోలు చేసినా అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో సీసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు సిబ్బంది రవి, విజయ్, రామకృష్ణ, భాస్కర్, వెంకటనారాయణలు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలేరు

అంబర్ పేట, ఏప్రిల్ 29, సమయం న్యూస్: అంబర్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఈ రోజు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ 8 మంది లబ్ధిదారులకు దాదాపూ 2 లక్షల 20 వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భూభారతితో రైతులకు పాదర్శకంగా సేవలు

- **ములుగు, మర్కుక్ మండలాల్లో భూభారతి చట్టంపై అవగాహన కల్పించిన కలెక్టర్ మను చౌదరి**




గజ్వేల్,ఏప్రిల్ 29:అత్యంత పారదర్శకంగా రైతులకు, పట్టాదారులకు మేలు జరగాలని, జిల్లా స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం చేసిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం మార్కుక్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో, ములుగు మండల కేంద్రంలోని కే ఎస్ ఆర్ గార్డెన్ లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎంతో మంది భూ సమస్యలు ఎదుర్కున్న విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మేధావులు, ప్రజలు, ఇతలరులందరితో చర్చించి భూ భారతి చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. సాదా బైనామా లో తెల్ల కాగితం మీద భూ విక్రయాలు జరిగిన వాటి గూర్చి భూ భారతి లో కొత్త చట్టం తీసుకొచ్చారని, దీనికి సంబంధించిన ప్రక్రియ గూర్చి అధికారులు మీకు క్లుప్తంగా విని మీకున్న సందేహాలు తెలిపితే నివృత్తి చేస్తారన్నారు. రెవెన్యూ రికార్డులలో ఒకరి పేరు మీది ఇంకొకరి రావడం, వారసత్వ పరమైన వాటికి ఈ చట్టం లో వెసులుబాటుతో పాటు డాక్యుమెంట్ వెరిఫై మరియు ఫీల్డ్ ఎంక్వైరీ చేసి, ఇరు వర్గాలను పిలిపించి ఇద్దరి వద్ద డాక్యుమెంట్ వెరిఫై చేసి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించే అవకాశం ఈ చట్టం లో కల్పించారన్నారు. భూమికి సంబంధించిన ఎలాంటి విషయాలైనా జిల్లా లో ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో జరుగుతాయన్నారు. మనిషికి ఆధార్ భూమికి భూదార్ కార్డ్ అని భూమి యొక్క హద్దులు జీపిఆర్ఎస్ లో పొందుపరిచే విధంగా పగడ్బందీగా ఉంచడంలో ఈ చట్టం భూదార్ కార్డ్ ఉపయోగపడుతుందని దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. గ్రామ స్థాయిలో మెయింటైన్ చేసే రికార్డ్స్, పట్టేదార్, రైతు, ఇతరులు రికార్డు కావాలని అప్లై చేసుకుంటే నిర్ణీత కాల వ్యవధిలో తీసుకునే వెసులుబాటు ఈ చట్టం లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, వంటిమామిడి మార్కెట్ కమిటి చైర్మన్ విజయ మోహన్, ఆయా మండలాల తహసిల్దార్లు ప్రవీణ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.




## సాంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి

* **టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**

భద్రా కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29 (సమయం న్యూస్):నేటి ఆధునిక యుగంలో సాంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా పాల్వంచలో జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న నాగా సీతారాములు పరమశివుని ప్రతిరూపమైన నటరాజు విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను కళాకారులను ప్రోత్సహించడం సామాజిక భాద్యత అని కళల కోసం అనునిత్యం కృషి చేస్తున్న జనహిత ఫౌండేషన్ చైర్మన్ శ్రీలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాగా సీతా రాములును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ రావు, ఆరోరా చైర్మన్ తాళ్లూరి హరిబాబు, పాల్వంచ కళా పరిషత్ చైర్మన్ వేముల కొండలరావు, ఏఎస్ఐ కమల కస్తూరి, మాజీ జడ్పీటీసి యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# వంటిమామిడి ఏఎంసీలో తీరనున్న రైతుల కష్టాలు

- **మార్కెట్ ను సందర్శించిన కలెక్టర్ మను చౌదరి**
- **సేకరించిన భూమిలో త్వరలో రైతులకు మార్కెట్ నిర్మాణం**
- **ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపిన కలెక్టర్**



గజ్వేల్, ఏప్రిల్ 29 : ములుగు మండలం వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. వంటిమామిడి మార్కెట్ వద్ద రోడ్డుపైనే వేకువ జాము నుండి మధ్యాహ్నం వరకు రైతులు విక్రయాలు జరపడం వల్ల రాజీవ్ రహదారిపై రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు రైతులకు ప్రమాద కరంగా ఉన్న విషయాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వంటి మామిడి ఏఎంసి కార్యదర్శి రేవంత్ ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు కలెక్టర్ మను చౌదరి వంటిమామిడి మార్కెట్ కమిటీని పరిశీలించారు. కలెక్టర్ కు మార్కెట్ కమిటీ అధికారులు, పోలీసులు సమస్యలను వివరించారు. ప్రతిరోజు మార్కెట్ ఉదయం 4.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1:00 గంటవరకు కొనసాగు తుందన్నారు. ఈ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు అమ్ముకునే రైతులు, వివిధ ప్రాంతాల నుండి కూరగాయలు కొనుగోలు చేసే వ్యాపారస్తులు వాహనాలలో ఎక్కువగా రావడం, వ్యాపారస్తులు మార్కెట్ లోపలికి వెళ్లకుండా రోడ్డుపైననే ఉంటూ వ్యాపారం కొనసాగిస్తున్నారన్నారు. మార్కెట్ రాజీవ్ రహదారి ప్రక్కనే ఉండటం వలన ప్రతి రోజు హైదరాబాదు నుండి సిద్దిపేట, కరీంనగర్ కు వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉండటం వలన భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుందని మార్కెట్ కమిటీ, పోలీస్ అధికారులు కలెక్టర్ కు తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వాహనాలలో కూర గాయలు తీసుకుని వచ్చి ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం మూలంగా ట్రాఫిక్ జామ్ అయి రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ చిన్న తిమ్మాపూర్, లక్ష్మక్క పల్లి గ్రామాలలో సేకరించిన 64 ఎకరాల స్థలంలో ప్రస్తుతం ఐదు ఎకరాలలో రైతుల కోసం ప్రత్యేకంగా మార్కెట్ ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ శాఖకు ప్రపోజల్స్ పంపుతామన్నారు. త్వరలో మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి రైతుల కోసం మార్కెట్ అందుబాటులోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖకు భూముల బదలాయింపు పై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రకళకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బి. విజయ మోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు ఉన్నారు.

## కాలుష్య కారమైన పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

- **గడ్డపోతారం,చెట్లపోతారం గ్రామ ప్రజలు పిసిబి అధికారులకు ఫిర్యాదు**



జిన్నారం,ఏప్రిల్ 29, సమయం న్యూస్: నియమాలకు విరుద్ధంగా విషవాయువులను యదేచ్ఛగా వదులుతున్న పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని గడ్డపోతారం, చెట్ల పోతారం గ్రామ ప్రజలు మంగళవారం పిసిబి అధికారులకు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది.జిన్నారం మండలంలోని చెట్ల పోతారం మున్సిపాలిటీ పరిధిలో గల కాజిపల్లి పారిశ్రామికవాడ లోని లీఫార్మా పరిశ్రమ నుండి ఈ నెల 26 వ తేదీ సాయంత్రం వేళల్లో విషపూరిత వాయువును వదిలారని, దీనితో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పలుమార్లు పరిశ్రమ వారికి చెప్పిన వారి తీరు మారడం లేదని, వాయు కాలుష్యానికి కారణమైన పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని పిసిబి అధికారికి ఫిర్యాదు చేశారు.



# కలెక్టర్ ను కలిసిన ట్రైనీ కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (సమయం న్యూస్): నూతనంగా జిల్లాకు నియమించబడిన ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు జిల్లాపై చర్చించుకోవడం జరిగింది.

# ఏఐటీయుసి ఆధ్వర్యంలో మేడే వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

మందమర్రి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: పట్టణంలోని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) కార్యాలయంలో మంగళవారం 139వ మేడే దినోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ, చికాగో అమరవీరుల త్యాగంతో ఏర్పడిన ఎర్రజెండా యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, యూనియన్ కార్యాలయం తోపాటు పలు కార్మిక వాడల్లో అరుణ ప్రతాకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆనాడు 8 గంటల పని దినం కోసం చికాగో నగరంలో కార్మికులందరూ సంఘటితమై, యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రదర్శనకారులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం జరిగిందని గుర్తు చేశారు. నేడు మనం అనుభవిస్తున్న ఎనిమిది గంటల పని దినాన్ని సాధించిన అమర వీరుల స్ఫూర్తిగా మేడే ను కార్మికులందరూ కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు




భీమనాథుని సుదర్శన్, జాయింట్ కార్యదర్శి కంది శ్రీనివాస్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీసీ విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తుండగా, బీసీ విద్యార్థి సంఘం నాయకులను జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నస్పూర్ అఖిల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి 16 నెలలు గడుస్తున్న ఇంతవరకు ఒక్క స్కాలర్షిప్ సైతం విడుదల చేయలేదని ఆరోపించారు. వెంటనే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును గుర్తించుకొని, ఫీజు తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అరెస్టయిన వారిలో విద్యార్థి నాయకులు శ్రావణ్, రాజ్ కుమార్ లు కలరు.

# పహల్గాం ఉగ్రదాడి పై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిరసన

హైదరాబాద్, ఏప్రిల్ 29: ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకునే ఏ చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడి పై నిరసనగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమీషనర్ ఆర్. వి.కర్ణన్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నిరసన తెలుపుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి భారతీయులందరి గుండెలను కలచివేసిందని అన్నారు. ఉగ్రవాదం పై ప్రపంచ వ్యాప్తంగా



నిరసనలు వెల్లువెత్తున్నాయన్నారు. ఉగ్రదాడి మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా ఆమె పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా ఐక్యతతో స్పందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ రక్షణకు, ప్రజల భద్రతకు తీసుకునే ఏ నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల కార్పొరేటర్లు మాట్లాడుతూ... ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. దేశ ప్రధాని తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని చేపట్టే అన్ని చర్యలకు భారతీయులుగా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కార్పొరేటర్లు, వంగ మధుసూదన్ రెడ్డి, రాధా ధీరజ్ రెడ్డి, లాల్ సింగ్ మీర్జాబేగ్, సోహెల్ ఖాద్రీ జగదీశ్వర్ రావు రాజశేఖర్ రెడ్డి మాట్లాగా బి జేపీ ఏ ఐ ఎం ఐ ఎం కాంగ్రెస్ కార్పొరేటర్లు సి సి పి శ్రీనివాస్, సి ఈ భాస్కర్ రెడ్డి, రత్నాకర్ అడిషనల్ కమిషనర్లు గీత రాధిక, వేణు గోపాల్ సరోజ, పంకజ, జోనల్, కమిషనర్ లు రవికిరణ్ హేమంత్ కేశవ్ పాటిల్ అపూర్వ చౌహాన్ వెంకన్న, సి ఏ అండ్ హెచ్ ఓ డాకర్ పద్మజ తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, జి హెచ్ ఎం సి కి చెందిన ఆయా యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక భరోసాకై ధాన్యం కొనుగోలు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: ప్రభుత్వం రైతులకు వారి హక్కుల భరోసా భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో కల్పిస్తుండగా, ఆర్థిక భరోసాకు ధాన్యం కొనుగోలుతో కల్పిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నేటికి 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 121 కేంద్రాలతో 21143.040 టన్నుల ధాన్యాన్ని 2395 రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి, 5.73 లక్షల రూపాయలు చెల్లింపులు చేయడం జరిగిందని వివరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని శుభ్రం చేసి, కొనుగోలు కేంద్రాల వద్దకు సూచించిన మార్గదర్శకాల ప్రకారం తీసుకుని రావాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



ఉండేందుకు, అదేవిధంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా ధాన్యం కొనుగోలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. ప్రకృతి విపత్తులతో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా, ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లకు, సిబ్బందికి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తెలుపుతూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని తెలిపారు.

# కలెక్టర్ సికింద్రాబాద్ తహసిల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

- **సమయానికి విధులకు రాని సిబ్బంది పై ఆగ్రహం**
- **సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవు**
- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

హైదరాబాద్ ఏప్రిల్ 29 ( సమయం న్యూస్) : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సికింద్రాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విధులకు గైరాజరైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ ఆర్డిఓ, తహసీల్దార్ కార్యాలయాలను అయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. తహసీల్దార్ కార్యాలయంలోనికి వెళ్లి హాజరు రిజిస్టర్ పరిశీలించి ఎవరెవరు కార్యాలయానికి వచ్చారని పరిశీలించి, హాజరు రిజిస్టర్ ప్రకారం ఒక్కొక్కరికి పేరు పేరున పిలిచి సమయానికి రాని సిబ్బందికి హాజరు రిజిస్టర్ లో ఆబ్సెంట్ వేసినారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అన్ని విభాగాలను పరిశీలించి కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా, కార్యాలయ నిర్వహణ, రికార్డులు సక్రమంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించి సికింద్రాబాద్ మండలంలో ఎంతమంది ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులను ఫిజికల్ వెరిఫికేషన్, స్క్రూటీని చేసి పంపించారని



తాసిల్దారును అడుగగా 7327 మంది నిరుద్యోగ యువత ఆన్ లైన్ లో దరఖాస్తు చేసు కున్నారని ఇప్పటివరకు 2572 దరఖాస్తులు వచ్చాయని తాసిల్దార్ తెలపగా అన్ని దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకుని, దరఖాస్తులను ఫిజికల్ గా వెరిఫై చేసి త్వరగా స్క్రూటిని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# పారదర్శకంగా సూపర్వైజర్ క్వార్టర్ల కౌన్సెలింగ్



మందమర్రి, ఏప్రిల్ 29 సమయం న్యూస్: ఏరియాలోని ఖాళీగా ఉన్న సూపర్వైజర్ క్వార్టర్ల కేటాయింపు కొరకు సింగరేణి సూపర్వైజర్ ఉద్యోగులకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సింగరేణి ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ లు తెలిపారు. మంగళవారం ఏరియాలోని సిఈఆర్ క్లబ్లో క్వార్టర్ల కొరకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏరియాలో ఖాళీగా ఉన్న సూపర్వైజర్ క్వార్టర్ల కేటాయింపు కొరకు ఏరియాకు 20 క్వార్టర్ లను ప్రకటించగా, వీటికి 10 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించి, సీనియార్టీ ప్రకారం 8 మంది సూపర్వైజర్ ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా డివైపిఎం మైత్రేయ బంధు, మేనేజ్మెంట్ ట్రైని ఐఈడి శ్యామ్ లు పాల్గొన్నారు.

# సమయం న్యూస్ ఎఫెక్ట్..

## డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

- **డంపింగ్ యార్డ్ పై సమయం డైలీ న్యూస్ లో వచ్చిన కథనాల దృష్ట్యా డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి.**
- **పలు అంశాల పై సంబంధిత శాఖ, మున్సిపల్ అధికారులతో చర్చ**
- **పనితీరులో అధికారుల నిర్లక్ష్యత పట్ల మండిపాటు**
- **పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 29, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో గల డంపింగ్ యార్డ్ పై సమయం డైలీ న్యూస్ లో అగ్ని ప్రమాదం, వ్యర్థాలను, వ్యర్థాల నుండి తయారయ్యే ముడి సరుకును కొలిచే వేయింగ్ మిషన్ తూకంలో తేడాలు ఉండడంతో, తూనికల అధికారులు సీజ్ చేయడం లాంటి వరుస కథనాలు రావడం దృష్ట్యా మాజీ మంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మంగళవారం బోధన్ లోని డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. ఇక్కడి కథనాలపై మున్సిపల్ అధికారులను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ బయోమైనింగ్ వివరాలను మున్సిపల్ అధికారులను అడగగా పొంతనలేని సమాధానం ఇవ్వడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి సరైన పద్ధతిలో పనిచేయాలని హెచ్చరికలు జారీ చేశారు. యార్డులో గల పూర్తి వివరాలను రికార్డులను ఉన్నత అధికారుల పరిశీలనకై పంపమన్నారు. అలాగే తూనికల అధికారులతో చరవాణి ద్వారా సంభా



షించి అందుకు సంబంధించిన పూర్తి వివరాలను పంపమని చెప్పారు. అక్కడినుండి మున్సిపాలిటీ కి చేరుకొని వ్యర్థాలను తరలించే వాహనాలను, వాటి స్థితిగతులను పరిశీలించారు. పలు వాహనాలు మూలన పడడంతో అందుకు గల కారణాలను అడిగి తెలుసుకుని వాటి మరమ్మత్తులపై చర్యలు చేపట్టాలని అందుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతను వ్యర్థ నిర్వహణకై మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని, తమ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సుపరిపాలన అందించే విధంగా పని చేయాలని, మున్సిపాలిటీ పరిధిలో, పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నామని అందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట బోధన్ మండల తహసిల్దార్ విట్టల్, మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, సంబంధిత శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినుద్దీన్, ప్రముఖ నాయకులు నాగేశ్వరరావు తూము శరత్ రెడ్డి పులి శ్రీనివాస్, మీర్ నజీర్ అలీ, అనంపల్లి ఎల్లయ్య, దామోదర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రమోద్ చిన్న, వైద్య తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

**: జిల్లా కలెక్టర్ బి యం సంతోష్**



మల్దకల్ ఏప్రిల్ 29 ( సమయం న్యూస్) : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్న ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన పలు రికార్డులను, ఓపీఎంఎస్ యాప్ లో ఆన్లైన్ ఎంట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అన్ని వివరాలు రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సేకరించిచే ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించే విధంగా ఆన్ లైన్ నమోదు ప్రక్రియ ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, స్వయంగా డిజిటల్ తేమ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి,కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులకు సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.2320/తో పాటు రూ.500 బోనస్ మొత్తం కలిపి రూ.2,820/ఇవ్వనున్న వివరాలు తెలిపే విధంగా చార్ట్‌ను రూపొందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా ప్యాడీ క్లినర్, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు,త్రాగు నీరు అందుబాటులో ఉంచాలని అన్నారు. తూకం చేసిన ధాన్యం సంచులను వెంటనే రైస్ మిల్లర్లకు తరలించే విధంగా ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు.

# ప్రపంచ స్థాయి నాట్య పోటీలలో నాగ అలేఖ్యకు నంది అవార్డు



గజ్వేల్, ఏప్రిల్ 29 : శ్రీ రాగ రమ్య కల్చరల్ అండ్ సోషల్ అండ్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి లో నిర్వహించిన అంతర్జాతీయ నృత్య పోటీలలో గజ్వేల్ పట్టణానికి చెందిన నాగ అలేఖ్య నంది అవార్డు అందుకున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయురాలు లక్ష్మి పద్మజ స్థానిక చిన్నారులు యువతులకు నృత్య శిక్షణ కూడా ఇస్తుంటారు. నృత్య శిక్షకురాలు లక్ష్మీ పద్మజ చొరవతో రవీంద్ర భారతిలో నిర్వహించిన అంతర్జాతీయ నృత్య పోటీలలో నాగ అలేఖ్య పాల్గొని తన అద్భుత ప్రదర్శనతో నంది అవార్డును గెలుచుకుంది. నాగ అలేఖ్య హైటెక్



# కేసులను ఎత్తివేయాలని నాయకుల వినతి

జిన్నారం, ఏప్రిల్ 29, సమయం న్యూస్; మండల కేంద్రమైన జిన్నారంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హిందూ ముస్లింలకు శాంతియుత సమావేశం మంగళవారం ఎన్ ఆర్ ఎస్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేశారు. జిన్నారం లో జరిగిన ఘర్షణలు దురదృష్టకరమని, ఆ సంఘటనలో పలువురిపై కేసు నమోదు అయ్యాయని, వారిపై కేసులను ఎత్తివేయాలని, కొత్త వారిపై కూడా కొత్తగా కేసులు పెట్టవద్దని జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ కు వివిధ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డిఎస్పి రవీందర్ రెడ్డి ,నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాల నిర్వహణకు

# అన్ని శాఖలు సమన్వయం తో కృషి చేయాలి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



కాళేశ్వరం ఏప్రిల్29( సమయం న్యూస్) : కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం ఏర్పాటు, టెంట్ సిటి ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలు, జాయ్ రైడ్, సత్రం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో పనులు పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్ డబ్ల్యూఎస్,పీఆర్,రవాణా, వైద్య తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఐపి ఘాట్ వద్ద టెంట్ సిటీ, ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్టు, స్టాళ్లు, కిడ్స్ జోన్ తదితర ఏర్పాటు చేయుటకు మార్కింగ్ చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. విఐపి ఘాట్ వెళ్ళు రహదారి నిర్మాణానికి మార్కింగ్ చేయాలన్నారు. జాయ్ రైడ్ చేసేందుకు కౌంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమయం లేదని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. సరస్వతి పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యేక ఘాట్లు, తాత్కాలిక వసతి కేంద్రాలు, ఆరోగ్య శిబిరాలు, తాగునీటి ఏర్పాట్లు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఈ పుష్కరాలలో ప్రత్యేకంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు స్టేజి ఏర్పాట్లు, విద్యుద్దీకరణ చేయాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రవచన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి విద్యుద్దీకరణ చేయాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పార్కింగ్, ఆర్టీసీ ప్రదేశాల్లో సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్ళడానికి అనువుగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయజక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్, దేవాదాయ శాఖ ఎస్ ఈ కనక దుర్గా ప్రసాద్, డిపిఓ నారాయణ రావు, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధు సూదన్, ఇరిగేషన్, పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈలు తిరుపతి రావు, వెంకటేశ్వర్లు, నళిని, ఆబ్కారీ ఈఎస్ శ్రీనివాస్, కాటారం డిఎస్పీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అరగంటలో కుదిపేసిన గాలి వాన

గజ్వేల్ నియోజకవర్గం లో తడిసిన ధాన్యం విరిగిన చెట్లు, ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు



గజ్వేల్, ఏప్రిల్ 29: గజ్వేల్ నియోజకవర్గం లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. గజ్వేల్, మర్కుక్, ములుగు తదితర మండలాల్లో సాయంత్రం ఒక్కసారిగా బలమైన గాలులతో వర్షం ప్రారంభమైంది. ప్రజ్ఞాపూర్ నుండి జగదేపూర్ వెళ్లే మార్గంలో శ్రీగిరి పల్లి బస్టాండ్ సమీపంలో రోడ్డుపై భారీ చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మకుక్ మండలం పాములపర్తి తదితర గ్రామాల్లో రోడ్లపై కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యం గాలివానకు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. పలువురు ఇండ్లపై ఉన్న రేకుల కప్పులు గాలులకు ఎగిరి దూరంగా పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో వందల మీటర్ల దూరంలో రేకులు పడిపోయాయి. వర్షం వస్తుందని తెలుసుకునే లోపే ఒక్కసారిగా గాలివాన ప్రారంభం కావడంతో ఒక గంటలో తీవ్ర బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి కూడా పలుచోట్ల కురిసే అవకాశం ఉంది.



# ఉదారత చాటుకున్న మంత్రి పొంగులేటి

*** బాలిక చదువుకు ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి**



వరంగల్ ఏప్రిల్29( సమయం న్యూస్) : వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్ లో భూభారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమంలో పాల్గొనడానికి వేదిక వద్దకు చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్కడే ఒక వృద్ధురాలు కాగితం చేతిలో పట్టుకొని దీన స్థితి లో ఏదో అవసరం కోసం వేచి చూస్తున్నట్లుగా ఉండడాన్ని గమనించిన మంత్రి స్వయంగా వేదిక పై నుండి నిలబడి ఆ వృద్ధురాలిని వేదిక మీదకు ఆప్యాయం గా పిలిచి ఇక్కడికి ఎందుకు వచ్చావు అమ్మా.. అని సమస్యను గురించి ఆరా తీయగా.. ఆ వృద్ధురాలు బదులిస్తూ తన పేరు వేల్పుల ఊర్మిళ అని 41 వ డివిజన్ శంభునిపేటలో తన నివాసమని, తన మనవరాలు వేల్పుల లిటి ఇటీవల 4 వ తరగతి పూర్తి చేసుకుని సెయింట్ గాబ్రియల్ పాఠశాలలో 5 వ తరగతి లో ప్రవేశానికి పరీక్ష రాసి సీటు సాధించడం జరిగిందని, కానీ లిటి తల్లిదండ్రులు మనస్పర్థల వల్ల వేరు గా ఉంటున్నారనీ, తన మనవరాలికి సీటు దక్కినప్పటికిని చదివించే స్తోమత తనకు లేదని మంత్రి వద్ద వాపోగా, వెంటనే స్పందించిన మంత్రి చదువు కోవడానికి అయ్యే వ్యయాన్ని భరిస్తానని ప్రకటించి మంత్రి చూపిన ప్రోత్సాహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.




# ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలి : కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్

అంబర్ పేట,ఏప్రిల్, 29, (సమయం న్యూస్) : గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద బిఆర్ఎస్ పార్టీ జిహెచ్ఎంసి కార్పొరేటర్ లతో కలిసి అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన పర్యాటక అమరవీరులకు ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈరోజు బిఆర్ఎస్ పార్టీ జిహెచ్ఎంసి సహచర కార్పొరేటర్లతో కలిసి గన్ పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులు తెలియజేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్ధించినట్టు తెలియజేస్తూ, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న పూకటి వేళ్ళతో పెకిలించాలని భారత ప్రభుత్వాన్ని కి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సహచర కార్పొరేటర్లు పాల్గొన్నట్లు తెలియజేశారు.

# మహనీయుల జయంతి ఉత్సవాలను

## జయప్రదం చేయండి



*** ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం పిలుపు**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 29, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు బోధన్ పట్టణంలో భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. ఏప్రిల్‌లో పుట్టిన మహనీయుల జయంతులను పురస్కరించుకుని, ఏప్రిల్ 30వ తేదీన బోధన్‌లో విస్తృతంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకుడు పరిమి కోటేశ్వరరావు, బోధన్ కన్వీనర్ నిరడి ఈశ్వర్ మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏప్రిల్ 30 బుధవారం రోజున బోధన్ రాఘవులు రైస్ మిల్ ప్రాంతం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించి, అనంతరం బహిరంగ సభలో ప్రముఖులు జేబీ రాజు, ఇతర వక్తలు ప్రసంగించనున్నారని చెప్పారు. మహారాష్ట్ర బృందం నిర్వహించే "అమ్మే సామ్మే" కార్యక్రమం సాయంత్రం 4 గంటల నుండి వేకువజాము 6 గంటల వరకు జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావే శంలో నీరడి రవికుమార్,సింగిడి పాండు కొండ్ర వెంకటి, దేవేందర్, కారం స్వామి, సురేందర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



జిహెచ్ఎంసి నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ వి కర్ణన్ ఐఏఎస్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ స్వచ్ఛ ఆటోటిప్పర్ మరియు రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కలమడుగు రాజేందర్, జిహెచ్ఎంసి అధ్యక్షులు కాట్రావత్ గోపాల్ నాయక్, ఖైరతాబాద్ ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి పరశురాములు, మీడియా ఇంచార్జ్ మూడవత్ మహేష్,కోఆర్డినేటర్ మచ్చగిరి,కార్యదర్శి ప్రభాకర్, లక్ష్మణ్, భాషా, హతీరాం తదితరులు పాల్గొన్నారు,

# అప్పుడు సచిన్‌కు 17..
# ఇప్పుడు వైభవ్‌కు 14 ఏళ్లే: ఇయాన్ బిషప్



వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే ఒకప్పుడు సచిన్ ఆటతీరు గుర్తుకొస్తుందని.. వైభవ్ చిన్నవయసులోనే సంచలనాలు నమోదు చేశాడని విండీస్ క్రికెట్ దిగ్గజం ఇయాన్ బిషన్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు. అతిపిన్నవయస్సులోనే శతకం బాదడం విశేషం. సచిన్ కూడా చిన్నవయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. 1990ల్లో జరిగిన పలు మ్యాచుల్లో భారత్ గెలవడంలో సచిన్ కీలక పాత్ర పోషించాడని ఇయాన్ గుర్తు చేసుకున్నాడు. అప్పుడు సచిన్‌కు 17 ఏళ్లేనని.. కానీ, ఇప్పుడు వైభవ్‌కు 14 సంవత్సరాలేనని బిషప్ పేర్కొన్నాడు. "నేను కౌంటీ క్రికెట్‌లో డెర్బీషైర్‌కు ప్రాతినిధ్యం వహించా. భారత్‌పై ఆడా. ఇప్పటికీ నాకు ఆ మ్యాచ్ గుర్తుంది. తొలుత మేం బ్యాటింగ్ చేశాం. మంచి లక్ష్యమే నిర్దేశించాం. బౌన్సీ పిచ్ కావడంతో తేలికగా విజయం సాధిస్తామని అనుకున్నాం. అందుకు తగినట్టుగానే వికెట్లూ పడగొట్టాం. కానీ, ఓ కుర్రాడు (సచిన్) క్రీజ్‌లోకి వచ్చాడు. కొన్ని బంతులను ఎదుర్కొన్నాక.. త్వరగా పెవిలియన్‌కు చేరుస్తామని భావించా. అయితే, ఓ బంతిని పొరపాటున సరైన లెంగ్త్‌లో కాకుండా కాస్త గతి తప్పింది. దానిని మైదానం వెలుపల ఉన్న చెట్టుకు తగిలేలా బాదాడు. ఆ 17 ఏళ్ల కుర్రాడు నన్ను షాక్‌కు గురి చేశాడు. గొప్పగా ఉండే నా కళ్లు తెరిపించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో వైభవ్ 14 ఏళ్ల కుర్రాడే. ప్రపంచస్థాయి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ సహా ఇతర బౌలర్లు తప్పకుండా షాక్‌కు గురై ఉంటారు" అని ఇయాన్ బిషప్ వ్యాఖ్యానించాడు. 1990ల్లో మహ్మద్ అజహరుద్దీన్ నాయకత్వంలోని టీమ్ఇండియా డెర్బీషైర్ జట్టుతో టూర్ మ్యాచ్ ఆడింది. ఛెస్టర్‌ఫీల్డ్ మైదానం బౌన్స్‌కు మారుపేరు. అలాంటి పిచ్‌పై భారత్‌కు 234 పరుగుల లక్ష్యం ఎదురైంది. సచిన్ ఎదురుదాడి చేయకుండా ఉన్నంత వరకూ ఆతిథ్య జట్టే గెలుస్తుందని తాము భావించినట్లు బిషప్ తెలిపాడు. విండీస్‌కు చెందిన ఈ మాజీ పేసర్ కౌంటీ క్రికెట్ ఆడాడు. తాను వేసిన లెంగ్త్ బంతిని మిడ్‌వికెట్ మీదుగా సిక్స్ కొట్టడం తనను షాక్‌కు గురి చేసిందని తెలిపాడు. జట్టులోని మిగతా బ్యాటర్లు ఎవరూ 35 కంటే ఎక్కువ పరుగులు చేయలేదని.. సచిన్ మాత్రం అజేయంగా 105 పరుగులు చేయడంతో భారత్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది.



## ముక్కోణపు సిరీస్.. సౌతాఫ్రికాపై భారత్ విజయం

కొలంబో: శ్రీలంక వేదికగా భారత్, శ్రీలంక, సౌతాఫ్రికా మహిళా క్రికెట్ జట్ల మధ్య ముక్కోణపు సిరీస్ జరుగుతోంది. ఇప్పటికే శ్రీలంకపై విజయం సాధించిన భారత్.. మంగళవారం సౌతాఫ్రికాతో (INDw vs SAw) జరిగిన మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ప్రతీకా రావల్ (78; 91 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి మెరిసింది. లక్ష్యఛేదనకు దిగిన సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తజ్మిన్ బ్రిట్స్ (109; 107 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేసినా సఫారీలకు ఓటమి తప్పలేదు. లారా వొల్వార్డ్ (43) రాణించింది. భారత స్పిన్నర్ స్నేహ్ రాణా (5/43) సౌతాఫ్రికా పతనాన్ని శాసించింది. అరుంధతి రెడ్డి, నల్లపురెడ్డి చరణి, దీప్తి శర్మ తలో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో ప్రతీకా రావల్‌తోపాటు హర్మన్‌ప్రీత్ కౌర్ (41), జెమీమా రోడ్రిగ్స్ (41), స్మృతి మంధాన (36), హర్లీన్ డియోల్ (29), రిచా ఘోష్ (24) రాణించారు.

# సినిమా



# ప్రిశా క్యూట్

మోడల్‌గా కెరీర్ స్టార్ట్‌చేసిన ప్రిశా రాజేశ్ సింగ్, తర్వాత హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. హిందీ, తెలుగు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది. నిఖిల్ 'స్పై'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. అనంతరం అల్లు శిరీష్ జోడీగా బడ్డీ మూవీలోనూ అలరించింది. ఇందులో ఎయిర్ హోస్ట్ రోల్‌లో నటించిన ఈ భామ.. కుర్రకారు మనసు దోచేసింది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ బ్యూటీ నటించిన సినిమాలు ఫ్లాప్ కావడంతో పెద్దగా చాన్స్‌లు దక్కలేదు. నటిగా తనను తాను నిరూపించుకోవాలనే ప్రయత్నంలో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. మరోవైపు మూవీల సంగతి ఎలా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం హాట్ లుక్స్ లో కుర్రకారుకు మత్తు వల విసురుతోంది. ఎప్పటికప్పుడు ట్రెండీ దుస్తుల్లో కనిపిస్తూ నెటిజన్లను ఇంప్రెస్ చేసే ఈ భామ తాజాగా వైట్‌కాస్ట్యూమ్స్ లో దిగిన పిక్స్ ఇన్‌స్టాలో షేర్ చేసింది. క్యూట్ లుక్స్‌తో ఫొజులు ఇస్తూ స్కిన్ షోతో పిచ్చెక్కిస్తోంది. ప్రస్తుతం ప్రిశా హాట్ ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## మండుటెండలో మళ్లీ వర్షం

○ ప్రభాస్‌మూవీ రీ రిలీజ్ డేట్ ఫిక్స్



రెబల్‌స్టార్‌ప్రభాస్‌ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. హాట్ సమ్మర్‌లో కూల్‌గా 'వర్షం' మూవీ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 21 ఏండ్ల తర్వాత మే 23న 4కెలో రీ రిలీజ్ కు సిద్ధమైంది. ఈ మేరకు అఫీషియల్ పోస్టర్ చేశారు మేకర్స్. యూత్ ఫుల్ లవ్, మాస్ ఎంటర్‌టైనర్‌గా 2004 జనవరి 14న వచ్చిన ఈ చిత్రం అప్పట్లో రికార్డులు సృష్టించింది. ఈ సినిమాకు శోభన్ దర్శకత్వం వహించగా.. సుమంత్ ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ఎంఎస్ రాజు నిర్మించాడు. ప్రభాస్‌కు జోడీగా త్రిషగా నటించింది. గోపీచంద్ విలన్ రోల్ మెప్పించగా .. ప్రకాష్ రాజ్ కీలక పాత్ర పోషించాడు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ సినిమాకే హైలెట్‌గా నిలిచింది.

## స్పెషల్‌సాంగ్‌లో క్రేజీ బ్యూటీ?



యంగ్ టైగర్‌ఎన్టీఆర్ అభిమానులతో పాటు, పాన్ ఇండియా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రశాంత్ నీల్ మూవీ చిత్రీకరణ ఇప్పటికే ప్రారంభం అయింది. కర్ణాటకలో భారీ సెట్ నిర్మించిన ప్రశాంత్ నీల్.. మెజార్టీ షూటింగ్ పార్ట్‌ను అక్కడే చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమాపై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. పైగా ఈ చిత్రానికి సంబంధించి ఎలాంటి వార్త వచ్చినా నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే ఈ చిత్రంలో మేకర్స్ ఓ స్పెషల్ సాంగ్ ను ప్లాన్ చేశారట. ఆ పాట కోసం నేషనల్ క్రష్ రష్మిక మందాన్నను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో, మీడియా సర్కిల్స్‌లో ప్రచారం తెగ జరుగుతోంది. బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్న రష్మిక ప్రస్తుతం పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తోంది. అయినా కూడా ప్రశాంత్ నీల్ వంటి స్టార్ దర్శకుడు అడిగితే ఎన్టీఆర్ వంటి సూపర్ స్టార్‌తో కలిసి ఐటెం సాంగ్ చేసేందుకు శ్రీవల్లి నో చెప్పే అవకాశం లేదని కొందరు అంటున్నారు. అయితే ఇప్పటి వరకు ఆ విషయమై మేకర్స్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రస్తుతానికి జరుగుతున్న ప్రచారం కారణంగా సినిమాకు మంచి హైప్ క్రియేట్ అవుతుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు.

## 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' నటుడు అనుమానాస్పద మృతి



బాలీవుడ్ నటుడు రోహిత్ బాస్ఫోర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అస్సాం రాష్ట్రానికి చెందిన అతడు తన ఫ్రెండ్స్‌తో కలిసి నిన్న సాయంత్రం సమీప అడవి ప్రాంతంలోని జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ రోహిత్ యాక్సిడెంట్ లో మృతిచెందినట్లు స్నేహితులు కుటుంబసభ్యు లకు సమాచారమిచ్చారు. అయితే రోహిత్‌మృతి పట్ల కొందరిపై అనుమానం ఉందని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌహతి మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో నిర్వహించిన శవపరీక్షలో అతని శరీరంపైనే కాకుండా తల, ముఖం ఇతర భాగాలపై అనేక గాయాలు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. కాగా త్వరలో విడుదల కానున్న 'ది ఫ్యామిలీ మ్యాన్ 3'లో స్టార్ నటి సమంతతో కలిసి రోహిత్ నటించారు.

## అభిమానికి సారీ



బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఓ అభిమానికి సారీ చెప్పింది. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ప్రీతి ట్విట్టర్‌లో ఫ్యాన్స్‌తో ముచ్చటించింది. వారు అడిగిన ప్రశ్నలకు రిప్లై ఇచ్చింది. ఈ క్రమంలోనే ఓ అభిమాని మీరు బీజేపీలో చేరుతున్నారా? అని అడగ్గా.. 'సోషల్ మీడియాతో ఇదే సమస్య. ప్రతిఒక్కరూ మనల్ని జడ్జ్ చేస్తారు. నేను గతంలో చెప్పినట్లు ఆలయాలకు, కుంభమేళాలకు వెళ్తే దాని అర్థం బీజేపీలో చేరతానని కాదు. ఫారిన్‌లో ఉన్న టైంలోనే దేశం విలువ నాకు తెలిసింది. అందరి కంటే నేను ఇప్పుడు భారత్‌ను, భారతీయ సంస్కృతిని ఎక్కువగా గౌరవిస్తున్నాను' అని పేర్కొంది. అయితే ఈ చిన్న ప్రశ్నకు ఇంత కఠినంగా ఆన్సర్ ఇవ్వాలా? అంటూ నెట్టింట ఆమె తీరుపై విమర్శలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రీతి అభిమానికి క్షమాపణలు చెప్పింది. 'నా రిప్లై మీకు కఠినంగా అనిపిస్తే నన్ను మన్నించండి. మీ క్వశ్చన్‌చూసి నేను అసహనానికి గురయ్యాను. నేను విదేశాల్లో ఉంటున్నందుకు నా పిల్లలు భారతీయతను మర్చిపోకూడదు కదా..! అందుకే వారికి దేశ గొప్పతనం తెలియాలని గుళ్లకు తీసుకెళ్తాను. దురదృష్టవశాత్తూ నేను ఈ విషయంలో ప్రతిసారీ విమర్శలు ఎదుర్కొంటున్నాను. దీన్ని రాజకీయం చేస్తున్నారు. అందుకే అలా మాట్లాడాను. మీరంటే నాకు ఎప్పుడూ గౌరవమే' అని ఆ అభిమానికి క్లారిటీ ఇచ్చింది.



అనన్య పాండే ఇటీవల ఇటలీలోని లేక్ కోమో నుండి ఒక అందమైన ఫోటోను పోస్ట్ చేశారు. సొగసైన నలుపు మరియు బంగారు రంగు దుస్తులు ధరించి, నేపథ్యంలో కొండలతో కూడిన ప్రశాంతమైన జలాల దగ్గర ఆమె ఎప్పటిలాగే అందంగా కనిపించింది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.